నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 17 జూలై 2024 | KHAMMAM

భారం తగ్గించుకోవడంపైనే దృష్టి

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు టౌన్, జూలై 16 : రుణమాఫీ విషయంలో రైతుల భారం తగ్గించే కన్నా ప్రభుత్వం భారం తగ్గించుకునే ప్రయత్నం చేయడమే ఎక్కువగా కనిపిస్తోందని, వడపోతలపైనే ఎక్కువగా దృష్టి సారించిందనే విషయం స్పష్టమవుతోందని భద్రాద్రి కొత్తగూడెం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఒక మాట ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక మాట చెప్పేది కాంగ్రెస్ నాయకులేనని, ఇది వారికి అలవాటుగా మారిందన్నారు. 2018, డిసెంబర్ 12 వరకు ముందున్న రైతులకు రుణమాఫీ వర్తించదనే నిబంధన ఎంతవరకు సబబు అని, ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అంటే లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమే అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులను మాయమాటలతో మభ్యపెట్టారని, అధికారం దక్కించుకున్న తర్వాత ఆంక్షలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు.

రుణమాఫీకి షరతులొద్దు..

- రేషన్ కార్డు నిబంధనను తొలగించాలి
- మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్

దమ్మపేట, జూలై 16 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు విధించకుండా ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రైతుల రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తాటిసుబ్బన్నగూడెంలోని తన స్వగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అలవిగాని హామీలతో రైతులను నమ్మించి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడానికి కుంటి సాకులు చెబుతూ కొర్రీలు పెడుతోందని, రైతులను ఎలాగైనా అనర్హులుగా చేసే విధంగా జీవో నెంబర్ 567ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దీని ప్రకారం రుణమాఫీకి అనర్హులు 80 శాతానికి పైగా ఉంటారని, మాఫీకి రేషన్ కార్డు నిబంధన ప్రతిపాదనను కూడా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసాలో కోత పెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించి మరీ కసరత్తు చేస్తోందని, ఇదే కోవలో రుణమాఫీని సైతం మమ అనిపించేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందని మండిపడ్డారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. వారిని గోస పెట్టే ప్రభుత్వాలకు మనుగడ ఉండదన్నారు. రేవంత్‌రెడ్డి తాను ముఖ్యమంత్రి కాకముందు ఒక ఇంటర్వ్యూలో ప్రజలను మోసం చేస్తేనే నమ్ముతారని చెప్పారని, అప్పుడు చెప్పింది ఇప్పుడు అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, వారి పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు.

త్యాగాన్ని స్మరించుకోవడమే మొహర్రం: నామా

ఖమ్మం, జూలై 16: త్యాగానికి ప్రతీక మొహర్రం అని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. విశ్వాసం, నమ్మకం కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ చేసిన బలిదానానికి మొహర్రం ప్రతీకగా నిలిచిందని గుర్తుచేశారు. మంచితనాన్ని, త్యాగాన్ని గుర్తుచేసుకోవడమే ఈ పండుగకు నిజమైన అర్థమని అన్నారు. త్యాగం, శాంతి, న్యాయం వంటి ఆదర్శాలు మనలో ఎప్పటికీ స్ఫూర్తిని నింపుతాయని వివరించారు.

జిల్లా ప్రజలకు 'నామా' ఏకాదశి శుభాకాంక్షలు

ఉమ్మడి జిల్లా ప్రజలకు ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు తొలి ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏడాది పొడవునా తెలంగాణ ప్రజల జీవితాల్లో ఆనందాలు నింపే పండుగలకు తొలి ఏకాదశి ఆది పండుగ అని గుర్తుచేశారు.

ఆధార్ సెంటర్లలో అడ్డగోలు దోపిడీ!

> ఆధార్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఆధార్ కార్డులో మార్పులు చేర్పులపై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకొని దోపిడీకి తెగబడుతున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఏ సర్వీస్‌కు ఎంత? అనే బోర్డులు ఆధార్ సెంటర్లలో ఎక్కడా కనిపించవు.. దీంతో ఇష్టారాజ్యంగా అందినకాడికి దోచుకుంటున్నారు. అవసరం కావడంతో ప్రజలూ అడిగినంత ఇచ్చేస్తున్నారు.
> – రఘునాథపాలెం, జూలై 16

- ప్రతి పనికీ ఇష్టారాజ్యంగా వసూళ్లు
- డేట్ ఆఫ్ బర్త్ మార్పిడికి రూ.3 వేలు పైనే..
- నిర్వాహకులు ఆడిందే ఆట.. పాడిందే పాట
- అటువైపు కన్నెత్తి కూడా చూడని అధికారులు
- 'తెలంగాణ' మార్పును ఉచితంగా అందించాలంటున్న ప్రజలు

ఖమ్మం వీడీవోస్ కాలనీలోని ఓ ఆధార్ సెంటర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతి పథకానికీ ఆధార్ కార్డు తప్పనిసరి. అయితే ఆధార్ కార్డు జారీ ప్రక్రియ సామాన్య ప్రజలకు కష్టాలను తెచ్చిపెడుతున్నది. సులభతరంగా అందించాల్సిన సేవలకు ఆధార్ సెంటర్ నిర్వాహకులు 'రేట్' ఫిక్స్ చేసి మరీ దండుకుంటున్నారు. ఆధార్ సేవలకై కేంద్రాలను ఆశ్రయిస్తే నిర్వాహకుల చేయి తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడిగినంత ఇచ్చుకోకుంటే రోజుల తరబడి కేంద్రాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఆధార్ కార్డుల జారీ, పేరు, అడ్రస్, డేట్ ఆఫ్ బర్త్ మార్పిడితోపాటు బయోమెట్రిక్ అప్‌డేషన్ వంటి సేవలను పొందేందుకు ప్రజలు పెద్దఎత్తున ఆధార్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల్లో ఈ-కేవైసీ ప్రక్రియను అమలు చేయడంతో కార్డులోని ప్రతి ఒక్కరికీ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడం తప్పనిసరైంది. దీంతో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం తమ పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడానికి ఆధార్ కేంద్రాల బాట పడుతున్నారు. ఫలితంగా ఆధార్ సెంటర్లు కిక్కిరిసి కనిపిస్తున్నాయి. దీన్ని అవకాశంగా మార్చుకున్న కేంద్రాల నిర్వాహకులు ప్రతి ఆధార్ కార్డుదారుడి వద్ద రూ.100 వసూలు చేస్తున్నారు. ఒక్క రేషన్ కార్డులో ఐదుగురు సభ్యులుంటే రూ.500 సమర్పించుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కేంద్రాలపై పర్యవేక్షణ నిల్..

ఆధార్ కేంద్రాల దోపిడీపై దృష్టి సారించాల్సిన అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. ఫలితంగా ఆధార్ కేంద్రాల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏదైనా అవసరం నిమిత్తం ఆధార్ కార్డులో పుట్టిన తేదీ మార్చాలంటే ఇకవేలల్లో సమర్పించుకోవాల్సిదేనని ప్రజలు వాపోతున్నారు. పుట్టిన తేదీకి సంబంధించిన పత్రాలు లేకుంటే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు తీసుకొని పని చక్కదిద్దుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలాలతో పోల్చితే ఖమ్మం నగరంలోని ఆధార్ సెంటర్ల దోపిడీ విపరీతమైనట్లు నగర ప్రజలు వాపోతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఆధార్‌లోని మార్పులు చేర్పుల కోసం కేంద్రాలకు రావడంతో నిర్వాహకుల పంట పండుతోంది. కేంద్రంలోని ప్రతి పనికీ రూ.100 చొప్పున అడుగుతుండడంతో ప్రజలు మారుమాట్లాడకుండా అడిగింది చేతిలో పెట్టి వెనుతిరుగుతున్నారు. రెవెన్యూ అధికారులు ఉండే జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం నగరంలో ఆధార్ సెంటర్లపై అధికారులు దృష్టి సారించి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని వేడుకుంటున్నారు.

> **తనిఖీలు చేపడుతాం..**
> ఆధార్ కేంద్రాల నిర్వాహకులు నిబంధనల మేరకే డబ్బులు తీసుకోవాలి. రూ.50 సర్వీస్‌కు రూ.100 తీసుకోవడం నేరం. ఆకస్మిక తనిఖీలు చేపడుతాం. అదనపు వసూళ్లకు పాల్పడే నిర్వాహకులపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం.
> – సీహెచ్.స్వామి, తహసీల్దార్, ఖమ్మం అర్బన్

'తెలంగాణ' అని మారిస్తే కూడా..

దేశవ్యాప్తంగా ప్రజలందరికీ ఒకే గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశంతో అప్పటి కేంద్ర సర్కార్ ఆధార్ కార్డుల జారీని తీసుకొచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రక్రియ చేపట్టడంతో ప్రతి ఒక్కరి ఆధార్ కార్డులపై అడ్రస్‌లో రాష్ట్రం పేరు 'ఆంధ్రప్రదేశ్' అని వచ్చింది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఆంధ్రప్రదేశ్‌ను కాస్త తెలంగాణగా మార్చుకోవడం రాష్ట్ర ప్రజలకు అనివార్యమైంది. తెలంగాణ అని మార్చుకోవడం కోసం కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ కేంద్రాల బాట పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణగా మార్చినందుకు సైతం ఆధార్ సెంటర్ల నిర్వాహకులు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇందుకు ఇంటి ధ్రువీకరణ పత్రం ఉంటేనే చేస్తున్నారు. అయితే రాష్ట్రం పేరు తెలంగాణగా మార్పు చేసుకోవడం అందరికీ తప్పనిసరి కాబట్టి ఆధార్ కేంద్రాల్లో ఉచితంగా సేవలు అందించేలా చూడాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉంటే.. ఇంటర్‌నెట్ సెంటర్లలో సైతం ఆధార్‌లోని అడ్రస్ మార్చుకోవడం, గార్డియన్(తండ్రి, భర్త) పేరు మార్చుకోవడం వంటి కొన్ని సేవలు పొందవచ్చు.. ఈ విషయం తెలియక అనేక మంది ఆధార్ సెంటర్లకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా..

గోదాములు నిర్మిస్తాం

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు

ఖమ్మం/మామిళ్లగూడెం, జూలై 16: రాష్ట్రంలో రైతుల అవసరాలకు అనుగుణంగా గోదాములు నిర్మిస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు, మంచి ధర వచ్చే వరకూ వారు తమ పంటలను నిల్వ ఉంచుకునేంత వరకూ గిడ్డంగులు నిర్మిస్తామని చెప్పారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా జిల్లాకు వచ్చిన ఆయన.. ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేస్తున్న అనేక కార్యక్రమాలతోపాటు రైతులు పండించిన పంటలను కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారిస్తానని అన్నారు.

అన్నదాతలకు వెన్నుదన్నుగా ఉంటా..

అన్నదాతలకు వెన్నుదన్నుగా ఉంటానని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం శ్రమించేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థల చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనకు.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్, శ్రీమంత రాక్స్ బంధుమిత్రుల ఆధ్వర్యంలో మంగళవారం అభినందన, ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ ప్రక్రియ ఆగస్టు 15లోగా పూర్తవుతుందని, ఈ నెల 18 సాయంత్రంలోగా రూ.లక్ష రుణమాఫీ చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృతనిశ్చయంతో అడుగులు వేస్తోందని అన్నారు.

వేతనాలు ఇవ్వండి మహాప్రభో..!

- దమ్మాయిగూడెంలో మిషన్ భగీరథ కార్మికుల ఆందోళన
- ఎల్అండ్‌టీ మేనేజర్, అధికారుల నిర్బంధం
- పోలీసుల జోక్యంతో విడుదల
- విధుల బహిష్కరణతో గ్రామాల్లో నిలిచిపోయిన తాగునీటి సరఫరా

అధికారులను నిర్బంధించి ఆందోళన చేస్తున్న కార్మికులు

తిరుమలాయపాలెం, జూలై 16 : ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెంలో మంగళవారం మిషన్ భగీరథ కార్యాలయం వద్ద కార్మికులు వేతనాల కోసం ఆందోళనకు దిగారు. ఏజెన్సీ కంపెనీ ఎల్అండ్‌టీ వారు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ కార్యాలయానికి వచ్చిన ఎల్అండ్‌టీ కంపెనీ జిల్లా మేనేజర్ ఎల్‌కే రెడ్డి, ఇద్దరు అధికారులను కార్యాలయంలో నిర్బంధించి ధర్నా చేశారు. కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.19,000 జీతం ఇస్తుంటే ఎల్అండ్‌టీ కంపెనీ, అధికారులు కుమ్మక్కై రూ.13,000 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. జీతాల చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని మేనేజర్‌ను నిలదీశారు. ప్రభుత్వం నుంచి కంపెనీకి బిల్లులు వచ్చేవరకు స్పష్టత ఇవ్వలేమని మేనేజర్ వారికి తెలిపారు. దీంతో వేతనాలు ఇచ్చేవరకు విధులను బహిష్కరిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న తిరుమలాయపాలెం ఎస్ఐ గిరిధర్‌రెడ్డి సిబ్బందితో అక్కడకు చేరుకొని కార్మికులతో మాట్లాడడంతో మేనేజర్, అధికారులను వదిలేశారు. మిషన్ భగీరథ కార్మికులు విధులను బహిష్కరించడంతో మండలంలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

రుణమాఫీ జీవోను సవరించాల్సిందే..

- తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన
- వైరాలో రైతు రుణమాఫీ జీవో కాపీ దహనం

వైరాలో నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

వైరాటౌన్, జూలై 16 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రైతు రుణమాఫీ జీవోను తక్షణమే సవరించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా వైరా బస్టాండ్ సెంటర్‌లో రైతు రుణమాఫీ జీవో కాపీని దహనం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ నిబంధనల్లో తెల్ల రేషన్‌కార్డు, పాస్ పుస్తకాలు, రెన్యువల్, రీషెడ్యూల్, గడువును సవరించి రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్‌కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉంటాయని వారందరికీ అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి పాస్ పుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నట్లు ప్రభుత్వ ప్రజాపాలన సర్వేలో తేలిందని గుర్తుచేశారు. రేషన్‌కార్డుల కోసం సైతం దరఖాస్తు చేసుకున్న వారు లక్షల సంఖ్యలో ఉంటారని అన్నారు. ప్రభుత్వం కొర్రీలు పెట్టకుండా ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ అధ్యక్షుడు మల్లెంపాటి రామారావు, కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, సంక్రాంతి నర్సయ్య, మాడపాటి వెంకట్, మాదినేని శ్రీనివాసరావు, గుమ్మా నర్సింహారావు, వడ్లమూడి మధు, యనమద్ది రామకృష్ణ, పాపగంటి రాంబాబు, తోట కృష్ణవేణి పాల్గొన్నారు.

సీఎం సమావేశంలో కలెక్టర్లు..

ఖమ్మం కలెక్టర్ ఖాన్

భద్రాద్రి కలెక్టర్ జితేశ్

ప్రజాపాలన, ధరణి సమస్యలు, వానకాలం వ్యవసాయం, ప్రజారోగ్యం, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు, డ్రగ్స్ నిర్మూలన తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజామ్మిల్ ఖాన్, జితేశ్ వి పాటిల్ పాల్గొన్నారు. వారితోపాటు సీపీ, ఎస్పీ, ఇతర అధికారులు కూడా ఉన్నారు.

ఇటీవలి వర్షాలకు నిండుతున్న వెంకమ్మ చెరువు

వెంకమ్మ చెరువు కింద వరినాట్లు

వరినారును కూలీలకు సరఫరా చేస్తున్న యువతి

అశ్వారావుపేట టౌన్, జూలై 16 : నైరుతి మొదలైన నాటి నుంచి నిన్నా మొన్నటి వరకూ విరామం లేకుండా వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. కానీ.. ఇప్పటికీ జిల్లాలో సాగుకు సరిపడినంత వర్షపాతం నమోదు కాలేదు. దీంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల అన్నదాతలూ వరుణ దేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్న వేళ.. అశ్వారావుపేట వెంకమ్మ చెరువు కింది రైతులు మాత్రం ఏకంగా వరినాట్లు వేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అశ్వారావుపేట మండలంలోని వెంకమ్మ చెరువుకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో దీని ఆయకట్టు కింది రైతులందరూ వరి నాట్లలో నిమగ్నమయ్యారు.

నీళ్లు లేని చోట నీలిమబ్బుల కోసం చూపులు..

వెంకమ్మ చెరువు కింది రైతులు వరినాట్లు వేసే పనుల్లో బిజీబిజీగా ఉంటే.. దాని వెలుపలి రైతులు మాత్రం దిగాలు పడుతున్నారు. వారిలోనూ కొందరు రైతులు తమ సొంత బోర్ల కింద, మరికొందరు రైతులు పొరుగు రైతుల బోర్ల కింద వరినాట్లు వేసుకుంటున్నారు. కానీ.. నీటి వసతి లేని రైతులు మాత్రం నీలిమబ్బుల కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తుండడం గమనార్హం.

వెంకమ్మ చెరువు కింద వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

నారుమడి నుంచి వరినారును సిద్ధం చేస్తున్న మహిళా కూలీలు

ముద్దుగా పెంచుకున్న మనవడే..

మరణశాసనం రాశాడు

- మద్యం, గుట్కాలు, గంజాయికి బానిసైన యువకుడు
- జల్సాలకు డబ్బు లివ్వనందుకు అమ్మమ్మను అంతం చేశాడు
- ఇంట్లో జారిపడి చనిపోయిందంటూ నమ్మించబోయాడు
- ఖమ్మం నగరంలో అమ్మమ్మను హత్య చేసిన మనవడు
- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన స్థానికులు



రాంబాయమ్మ (ఫైల్)

మామిళ్లగూడెం, జూలై 16: ముద్దుగా పెంచుకున్న మనవడే ఆ ముసలమ్మకు మరణ శాసనం రాశాడు. జీవిత చరమాంకంలోనూ విశ్రాంతి తీసుకోకుండా, కొడుకు వద్దకు వెళ్లి ప్రశాంత జీవనం గడపకుండా.. మనవడిపైనే మమకారం చూపిస్తూ అతడినే తన వద్ద ఉంచుకొని కాలం వెళ్లదీస్తున్న ఆ అమ్మమ్మను చివరికి అతడే అంతమొందించాడు. 'మద్యానికి డబ్బులడిగితే లేవంటావా?' అంటూ అల్లారుముద్దుగా పెంచిన అమ్మమ్మను అక్కడికక్కడే అంతం చేశాడు. ఈ హృదయ విదారక ఘటన ఖమ్మం జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకోగా.. మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మ (80), విశ్వనాథం దంపతులకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు. ఉపాధి నిమిత్తం కొడుకులు వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. కుమార్తెలకు వివాహాలై వారిళ్లకు వెళ్లిపోయారు. భర్త విశ్వనాథం కూడా ఇప్పటికే మృతిచెందడంతో ఆమె ఇక్కడ ఒంటరిగానే ఉంటోంది. చిన్న కుమార్తె వసంత కుమారుడు ఉదయ్‌కుమార్‌ను తనతోనే ఉంచుకుంటోంది. ఆమె కుమారుల్లో ఒకరైన గురవయ్య హైదరాబాద్‌లో ప్రైవేటు లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. వృద్ధాప్యంలో ఖమ్మంలో ఉంటూ ఇబ్బంది పడవద్దని, హైదరాబాద్ వచ్చి తన వద్ద ఉండాలని అతడు కోరినా ఆమె వెళ్లలేదు. మనవడిపై మమకారం, ఇరుగూపొరుగుతో అనుబంధం పెంచుకున్న ఆమె.. తన కుమారుడి వద్దకు వెళ్లేందుకు ఇష్టపడలేదు. ఆ కొడుకు పంపించే భత్యం, ప్రభుత్వం నుంచి వచ్చే ఆసరా పింఛన్‌తోనే బతుకును వెళ్లదీస్తోంది. చిన్న కుమార్తెకు వేరే వివాహం చేయడంతో ఆమె కుమారుడైన ఉదయ్‌కుమార్‌ను ఈ వృద్ధురాలే పెంచి పెద్దచేసింది. అమ్మమ్మ వద్దే పెరుగుతున్న అతడు.. పదో తరగతిలో ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తరువాత జులాయిగా మారి మద్యం, గంజాయి, గుట్కా వంటి చెడు వ్యసనాలకు, జల్సాలకు అలవాటు పడ్డాడు. డిప్లొమా కోర్సును కూడా మధ్యలోనే వదిలేశాడు. గుట్కాలు, మద్యం, గంజాయికి బానిసయ్యాడు. డబ్బు కోసం అమ్మమ్మను తరచూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కూడా తన జల్సాలకు అవసరమైన రూ.3 వేలు ఇవ్వాలని అమ్మమ్మపై ఒత్తిడి చేశాడు. తన వద్ద లేవని ఆమె చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న ఉదయ్‌కుమార్ ఆగ్రహంతో ఊగిపోయాడు. ఆమెపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. మంగళవారం ఉదయం వేళ ఇంట్లో వృద్ధురాలి అలికిడి లేకపోవడంతో ఇరుగూపొరుగు వారు ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పటికే ఆమె మృతిచెంది ఉండడాన్ని గమనించి ఉదయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అయితే ఇంట్లో జారి పడిందని అతడు నమ్మించే ప్రయత్నం చేశాడు. ఇంట్లోని వాతావరణం, అతడి ప్రవర్తన వారికి అనుమానాన్ని కలిగించాయి. దీంతో వారు గట్టిగా నిలదీయడంతో అసలు విషయాన్ని చెప్పాడు. దీంతో ఆగ్రహించిన స్థానికులు.. దేహశుద్ధి చేసి ఖమ్మం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. అన్నం సేవా ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు బృందం సహకారంతో వృద్ధురాలి మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కుమారుడు గురవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ తెలిపారు.